బుధవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, లక్ష్మీప్రసన్న దంపతులు

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- అన్ని సర్వేలూ అదే చెప్తున్నాయ్!
- ఢిల్లీ పార్టీలు కావాలా? ప్రజల పార్టీ కావాలా?
- ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు
- సొంత గూటికి రామ్మోహన్‌గౌడ్ దంపతులు
- పార్టీలో తగిన ప్రాధాన్యం ఇస్తామని భరోసా

ఎల్బీనగర్, నవంబర్ 1: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని, అన్ని సర్వేలూ అదే ఖాయమని తేల్చాయని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరి ఎల్బీనగర్ టికెట్ ఆశించి భంగపడ్డ ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న దంపతులను బీఎన్‌రెడ్డినగర్‌లోని వారి నివాసంలో మంత్రి హరీశ్‌రావు కలిశారు. గులాబీ కండువాలు కప్పి వారిని బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రామ్మోహన్‌గౌడ్ ఉద్యమకాలం నుంచి తమతో కలిసి పనిచేశారని చెప్పారు. రెండుసార్లు ఆయనకు పార్టీ టికెట్ ఇచ్చిందని, దురదృష్టవశాత్తు స్వల్ప మెజార్టీలో ఓడిపోయారని తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో 11 మంది కార్పొరేటర్లను గెలిపించిన ఘనత రామ్మోహన్‌గౌడ్‌దేనని చెప్పారు. పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరి టికెట్ ఆశించారని, అక్కడ టికెట్ దక్కలేదని తెలిపారు. పార్టీ ప్రతినిధిగా తాను బాధ్యత తీసుకుంటున్నానని, రాష్ట్ర స్థాయిలో ఓ మంచి పదవిని ఇవ్వడంతోపాటు రామ్మోహన్‌గౌడ్ అనుచరులకు కూడా పార్టీపరంగా సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఎల్బీనగర్ నియోజకవర్గం రెండు లేదా మూడు నియోజకవర్గాలుగా విభజన అవుతుందని, రామ్మోహన్‌గౌడ్‌కు, లక్ష్మీప్రసన్నకు అందులో అవకాశం దక్కుతుందని భరోసా ఇచ్చారు. ఢిల్లీలో హైకమాండ్ ఉన్న పార్టీలు కావాలా, గల్లీలో ప్రజల మధ్య ఉండే పార్టీ కావాలా అని ప్రజలు ఆలోచిస్తున్నారని చెపపారు.

సీఎం కేసీఆర్‌పై అభిమానం, నమ్మకం: రామ్మోహన్‌గౌడ్

సీఎం కేసీఆర్‌పై అభిమానం, నమ్మకంతో తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుతున్నామని ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ చెప్పారు. పార్టీలో తమకు తగిన న్యాయం చేయాలని కోరామని, స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరినట్టు చెప్పారు. సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మల్లారపు శాలినీ తోపాటు ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌దే హ్యాట్రిక్

- కేసీఆర్ వస్తే రైతుబంధు ఎకరాకు 16 వేల రూపాయలు
- ఎన్ని ఎకరాలున్నా కాంగ్రెస్ పార్టీ ఇచ్చేది కేవలం రూ.15 వేలే
- అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తాం
- ఆసరా పింఛన్లు పెంచుతాం
- రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం
- మెదక్ పర్యటనలో మంత్రి హరీశ్



బుధవారం మెదక్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

మెదక్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ కొట్టేది సీఎం కేసీఆరేనని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మెదక్ జిల్లా పాపన్నపేట, హవేలీఘనపూర్, మెదక్, మెదక్ పట్టణం, చిన్నశంకరంపేట, రామాయంపేట మండలాల్లో కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మెదక్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కంతారెడ్డి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. రేషన్‌కార్డు ఉన్న వాళ్లకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇవ్వబోతున్నామని, ఇందుకు ఏటా రూ.1,300 కోట్లు ఎక్కువ ఖర్చు అవుతుందని, అయినా అయినా వెనుకాడేది లేదని తెలిపారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రాగానే రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళలకు రూ.3వేలు అందజేస్తామని భరోసా ఇచ్చారు. ఆసరా పింఛన్లను విడతలవారీగా రూ.5వేలకు పెంచనున్నట్టు సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో ప్రకటించారని, అధికారంలోకి రాగానే అమలు చేస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.15 లక్షల వరకు ఉచిత వైద్యం అందించనున్నట్టు వెల్లడించారు.

ఎన్ని ఎకరాలు ఉన్నా కాంగ్రెస్ ఇచ్చేది 15 వేలే

రైతుబంధు సృష్టికర్త సీఎం కేసీఆర్ అని, రైతుకే డబ్బు ఇచ్చిన ఒకే ఒక్కడు కేసీఆర్ అని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. రైతుబంధు ద్వారా ఎకరాకు ఏటా రూ.10 వేల చొప్పున కేసీఆర్ ప్రభుత్వం అందజేస్తున్నదని గుర్తుచేశారు. మూడోసారి అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.16 వేలు ఇస్తామని, అదే కాంగ్రెస్ ఎన్ని ఎకరాలు ఉన్నా రూ.15వేలు ఇస్తామని అంటున్నదని, దీనిని రైతులు ఆలోచించాలని సూచించారు. కర్ణాటకలో 5 గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నామని ఒప్పుకొని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ నెత్తిన పాలు పోసిండని అన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రైతుల నుంచి ఎకరాకు కేవలం 13 క్వింటాళ్ల వడ్లు కొంటున్నదని, మిగతావి కొనరని తెలిపారు. తెలంగాణలో రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో సేకరిస్తున్నదని చెప్పారు. ఈసారి అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు ఇవ్వబోతున్నామని, తద్వారా లబ్ధిదారులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలను ఆర్థికంగా పరిపుష్టం చేసిన బీఆర్ఎస్‌కు ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అందరూ కష్టపడి పద్మా దేవేందర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తతలు

సీఎం ఇంటి సమీపంలోని పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన ఆందోళనకారులు

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు రేగాయి. ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ నివాసానికి సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను ఆందోళనకారులు చుట్టుముట్టారు. ఆయుధాలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి వారిని చెదరగొట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇంఫాల్‌లో మళ్లీ కర్ఫ్యూ విధించారు. మంగళవారం మోరే ప్రాంతంలో హెలీప్యాడ్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న పోలీస్ అధికారిని మిలిటెంట్లు కాల్చి చంపిన విషయం తెలిసిందే. ప్రభుత్వ అసమర్థతత వల్లే ఈ ఘటన జరిగిందని స్థానిక యువజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళనకారులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన కొనసాగించారు.

- కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్సీ కవిత పరామర్శ

కత్తిదాడికి గురై యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దంపతులు బుధవారం పరామర్శించారు. వైద్యులను అడిగి ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన సతీమణి, కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ఏసీ బస్సుల్లో స్నాక్స్‌కు విశేష స్పందన

- త్వరలో సూపర్ లగ్జరీ బస్సుల్లోనూ అమలు

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా టీఎస్ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు అందించే మిల్లెట్ స్నాక్స్‌పై విశేష స్పందన వస్తున్నది. అక్టోబరు 16 నుంచి ప్రయాణికులకు ఈ స్నాక్స్ ప్యాకెట్ అందిస్తున్నారు. దీనికి చార్జీలోనే అదనంగా రూ.30 కలిపి తీసుకుంటున్నారు. మిల్లెట్స్ చిక్కి, రస్క్, కారా, టిష్యూ పేపర్ ఈ బాక్స్‌లో ఉంటాయి. ప్రయాణికులకు ఆరోగ్యవంతమైన ఆహారం అందించడంతోపాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనలతో దీనిని అమలులోకి తెచ్చినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ ప్యాకెట్లను ప్రయాణికులకు అందించినందుకు డ్రైవర్లకు ప్యాకెట్‌పై 50 పైసలు చెల్లిస్తున్నారు. మూడు నెలల క్రితమే ఆర్టీసీ మొదట ఇంటర్ స్టేట్ ఏసీ బస్సుల్లో స్నాక్స్ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రయాణికులకు ఓ ఫారం ఇచ్చి అభిప్రాయాలను సేకరించింది. మంచి స్పందన రావడంతో అక్టోబరు 16 నుంచి రాష్ట్రంలోని అన్ని ఏసీ బస్సుల్లోనూ అందుబాటులోకి తెచ్చింది. కార్పొరేషన్ పరిధిలో 11 రీజియన్లలో 300 ఏసీ బస్సులు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ స్నాక్స్‌పై ప్రయాణికుల నుంచి ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకుంటున్నారు. ప్రయాణికుల స్పందనను బట్టి సూపర్ లగ్జరీ బస్సుల్లోనూ ప్రవేశపెడతామని అధికారులు చెప్పారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం బొజ్జాయిగూడెం సభలో సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని చప్పట్లతో స్వాగతిస్తున్న ప్రజలు

సభల జోరు జన హోరు

- సత్తుపల్లి, ఇల్లందులో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్
- లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు
- గులాబీమయంగా రెండు పట్టణాలు
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

ఖమ్మం, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అభిమానం ఉవ్వెత్తున ఎగిసింది.. జనప్రవాహం పోటెత్తింది.. బుధవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో నిర్వహించిన బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలు జన సునామీలను తలపించాయి. సభలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి లక్షలాదిగా ప్రజలు తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా జన నేతను చూసేందుకు వేచి ఉన్నారు. సభా ప్రాంగణంలో సెల్ఫీలు తీసుకుంటూ యువతీ యువకులు సందడి చేశారు. 'జై కేసీఆర్.. జై జై కేసీఆర్' నినాదాలతో సభా ప్రాంగణాలు దద్దరిల్లాయి. సీఎం కేసీఆర్ రాక బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వివరిస్తుండగా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవహార శైలిపై పరోక్షంగా సీఎం సంధించిన వాగ్బాణాలకు ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు. సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన ప్రతి ఎస్సీ కుటుంబానికి దళితబంధు ఇస్తానని, పథకం ఇచ్చేరోజు తానే స్వయంగా సత్తుపల్లికి వస్తానని ప్రకటించినప్పుడు సభికులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తంచేశారు. ఇల్లందులో ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న, సత్తుపల్లిలో ప్రజాగాయని మధుప్రియ బృందం ప్రదర్శించిన ధూంధాం సభికులను ఉర్రూతలూగించింది. సత్తుపల్లిలో గులాబీజెండాపై మధుప్రియ పాడిన పాటకు రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య నృత్యం చేసి సభికులను ఉత్సాహపరిచారు.



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కల్లూరులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు పొలం గట్ల మీదుగా తరలివస్తున్న ప్రజలు

గులాబీరంగు పులుముకున్న తాడిచెట్టు..పైన జెండా

కేసీఆర్ గొప్ప నాయకుడు

కేసీఆర్ ప్రభావి ముఖందరు. అంతహ సీఎం నమాత్ర ఇద్దరే తుంబా చెన్నగిట్టు (కేసీఆర్ గొప్ప నాయకుడు..అలాంటి సీఎం మాదగ్గర ఉంటే బాగుండు)..కర్ణాటకలోని బీదర్ జిల్లా హుమ్నాబాద్‌కు చెందిన రైతులు ముక్తకంఠంతో చెప్పున్న మాట ఇది.
కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పగించి తాము తప్పు చేశామన్న అన్నదాతలు.. తెలంగాణ ఓటర్లు మాత్రం ఆ తప్పు చేయవద్దని హెచ్చరిస్తున్నారు.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో మాట్లాడుతున్న హుమ్నాబాద్ రైతులు

- అలాంటి సీఎం మాకు లేనే లేడు
- కాంగ్రెస్ మా దగ్గర ఏం చేయలే
- మీకాడ వస్తే కూడా ఏం చేయదు
- ఇగ అర్థం చేస్కోవాల్సింది మీరే
- తెలంగాణ ఓటర్లకు కర్ణాటకలోని హుమ్నాబాద్ రైతుల హెచ్చరిక

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఐదు నెలలు గడువకముందే కర్ణాటకను అధికార కాంగ్రెస్ కాటగలుపుతున్నది. సాగుకు నిరంతరాయంగా కరెంటిస్తామంటూ అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ ఐదు గంటలు మాత్రమే విద్యుత్తు సరఫరా చేస్తూ రైతులను అరిగోస పెడుతున్నది. దీంతో కన్నడ అన్నదాతలు కాంగ్రెస్ పార్టీపై మండిపడుతున్నారు. పొరుగున ఉన్న తెలంగాణలో కేసీఆర్ సర్కారు వ్యవసాయానికి 24 గంటలపాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తుంటే, తమకెందుకు ఇవ్వరంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఈ మేరకు కర్ణాటకలోని బీదర్ జిల్లా హుమ్నాబాద్‌కు చెందిన రైతులు తమ ఆవేదనను వెళ్లబోసుకొన్నారు.

తెలంగాణలో రైతు పథకాలు భేష్

'అధికారంలోకి వస్తే.. ఇది చేస్తాం, అది చేస్తామం'టూ.. తెలంగాణలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఊదరగొట్టారు. దీనిపై హుమ్నాబాద్ రైతులను ప్రశ్నించగా వాళ్లు ఈ విధంగా స్పందించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ సర్కారు తమకు ఏమీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే, అక్కడి రైతుల పరిస్థితి కూడా తమలాగే తయారవుతుందని హెచ్చరించారు. దీన్నిబట్టి కాంగ్రెస్‌కు ఓటెయ్యాలో? లేదో? తెలంగాణప్రజానీకమే నిర్ణయించుకోవాలని సూచించారు.తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల కరెంటును ఇస్తుండటాన్ని వాళ్లు గుర్తుచేశారు. రైతులకు ఎకరాకు రూ. 10 వేలు పెట్టుబడిసాయంగా ఇస్తున్న 'రైతుబంధు' పథకాన్ని, రైతు బీమాను, 24 గంటల ఉచిత విద్యుత్తును, రైతు వేదికల ఏర్పాటును ప్రశంసించారు. అన్నదాతలకు ఇంత మేలు చేస్తున్న సీఎం కేసీఆర్ గొప్ప నాయకుడు అని కొనియాడారు. కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రి తమదగ్గర కూడా ఉంటే ఎంతో బాగుండునని మనసులో మాటను బయటపెట్టారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

ఊసరవెల్లే ఉలిక్కిపడేలా..

'ఓడ ఎక్కేదాకా ఓడ మల్లన్న.. ఓడ దిగాక బోడి మల్లన్న' అన్నట్టు ఉన్నది కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. అధికారంలోకి రావడానికి ముందు సాగుకు నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేస్తామంటూ హామీలతో ఊదరగొట్టిన కాంగ్రెస్ పెద్దలు.. పగ్గాలు చేపట్టిన తర్వాత దాన్ని అటకెక్కించారు. ఇటీవల సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ.. ఐదు గంటల కరెంటు సరఫరాకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. 7 గంటల కరెంటు ఇవ్వాలనుకొన్నా.. అది సాధ్యపడట్లేదని, 5 గంటల కరెంటు ఇస్తున్నామని డీకే శివకుమార్ చెప్పుకొచ్చారు. నిరంతరాయ కరెంటు ఇస్తామంటూ ఓట్లడిగిన కాంగ్రెస్.. ఇప్పుడు ఐదు గంటల విద్యుత్తును మాత్రమే ఇస్తున్నదని కన్నారి, బీదర్, గుల్బర్గా, కొప్పాల్, గదగ్ తదితర ప్రాంతాల రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అక్టోబర్‌లో రికార్డుస్థాయి లోటు వర్షపాతం

- రాష్ట్రంలో 5.7 మి.మీ.వర్షపాతం
- ఏడు జిల్లాల్లో అధికం.. 21 జిల్లాల్లో సాధారణం
- 5 జిల్లాల్లో లోటు నమోదు
- వెల్లడించిన తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ సొసైటీ

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ నెలలో రికార్డు స్థాయిలో లోటు వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 89.8 మి.మీ.కు గాను 5.7 మి.మీ. వర్షపాతమే నమోదైంది. దీంతో మైనస్ 94 శాతంగా లోటు వర్షపాతం నమోదైందని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ సొసైటీ వెల్లడించింది. 2021-22 అక్టోబర్ నెలలో 117.8 మి.మీ. వర్షపాతం నమోదవగా, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది లోటు వర్షపాతం నమోదైనట్టు పేర్కొన్నది. నవంబర్ నెలలో 19.9 శాతం సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. రెండేండ్లుగా నవంబర్‌లో ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు. ఎల్‌నినో ప్రభావంతో నవంబర్‌లో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉంది. సాధారణ వర్షపాతం 829.2 మి.మీ., ఉండగా, నవంబర్ 1 వరకు 867.6 మి.మీ., వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జూన్‌లో 72.6 మి.మీ. జులైలో 489.9 మి.మీ. ఆగస్టులో 80 మి.మీ. సెప్టెంబర్‌లో 218.6 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదవగా, జోగులాంబ-గద్వాల, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. నిరుడు ఇదే సమయానికి 1215.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది మైనస్ 29 శాతం లోటు వర్షపాతం నమోదనట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 7 జిల్లాల్లో అధిక వర్షపాతం, 21 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 5 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనట్టు టీఎస్‌డీఎస్ వెల్లడించింది.